క్లుప్తంగా

మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలి

న్యూశాయంపేట : పేద మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్న గురుకులాల్లో తమ పిల్లలను చేర్పించాలని టీమ్రీస్ ఆర్‌ఎల్‌సీ శ్రీపాల కోరారు. ఆదివారం అడ్మిషన్ ప్రచారంలో భాగంగా హనుమకొండ ఈద్గా బొక్కలగడ్డ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సర్వర్ మోహియోద్దీన్, పాల్గొన్నారు.

ఉచిత సమ్మర్ క్యాంప్

న్యూశాయంపేట : వేసవి సెలవుల నేపథ్యంలో ముస్లిం విద్యార్థులకు ఇస్లామిక్ ఎడ్యుకేషన్‌పై ఉచిత సమ్మర్ క్యాంప్ ఆదివారం హనుమకొండ పాత బస్‌డిపో దగ్గర ఉన్న మీనార్ మజీద్‌లో ప్రారంభమైంది. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు నదీమ్‌బేగ్, నాజ్రీన్ తెలిపారు. ఈ అవకాశాన్ని గోకుల్ నగర్, రాంనగర్, తదితర పాత డిపో పరిసర పరిధిలోని ముస్లిం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ మంత్రిని కలిసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ



హన్మకొండ : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు కలిశారు. ఆదివారం నూతన సచివాలయంలో అడుగిడి బాధ్యతలు చేపట్టిన మంత్రిని ఎన్పీడీసీఎల్ సీఎండీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

హన్మకొండ అర్బన్ : గ్రేటర్‌లోని అన్ని డివిజన్లకంటే 60వ డివిజన్‌ను అభివృద్ధిలో ముందుంచేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం వడ్డెపల్లిలో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించే ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో మొదటిసారిగా అత్యాధునిక హంగులతో ఒక మోడల్ కమ్యూనిటీ హాల్‌ని నిర్మిస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై హర్షం వ్యక్తం చేస్తూ ముదిరాజ్‌లు అభినవ్ భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేశబోయిన అరుణ్ శ్రావణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు, వడ్డెపల్లి ముదిరాజ్ సంఘం నాయకులు, మత్స్య సంఘం నాయకులు, పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ఆర్యసమాజ్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా దేవయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమానికి పురోహితురాలు జోష్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగమార్గం ద్వారా భగవంతుడికి ఎలా సాక్షాత్కారం చేసుకోవాలో సూచించారు. యోగా ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పురోహితులు రాంబ్రహ్మచారి, స్థానికులు గూడూరు రామ్మూర్తి, పోరండ్ల కుమారస్వామి, కాజీపేట వెంకటరమణ, తేరాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

3న శంకుస్థాపన మహోత్సవం

హన్మకొండ కల్చరల్ : వరంగల్ శ్రీశైవ మహాపీఠం ఆధ్వర్యంలో వరంగల్ హంటర్‌రోడ్‌లోని గాయత్రినగర్ శ్రీవిశ్వేశ్వరపురిలో శ్రీవిశ్వేశ్వరాలయం, కల్యాణ మంటప నిర్మాణాన్ని పురస్కరించుకొని ఈనెలయ 3న శంకుస్థాపన మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ బండారు ఉమా మహేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ముది గొండ విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు శ్రీపతి పండితారాధ్యులు సతీష్‌చంద్ర శర్మ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలి పారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు శ్రీశైవ మహా పీఠాధిపతి శివశ్రీ అత్తలూరి మృత్యుంజయ శర్మచే శంకుస్థాపన మహోత్సవం జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నప్రసాదాల వితరణ కార్యక్రమం జరుగుతుందని భక్తులు, కాలనీవాసులు పాల్గొనాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కాజీపేట: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ఆటోలను ఇష్టారీతిగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్లపై కఠినచర్యలు చేపడతామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం కాజీపేట చౌరస్తాలో అడ్డా డ్రైవర్లతో ఆయన మాట్లాడుతూ ప్రతివ్యక్తి విధిగా వన్‌వే పద్ధతిని పాటించాలని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేసి ఆర్టీఓ అధికారులకు అప్పగిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులుఏ, డ్రైవర్లు పాల్గొన్నారు.

అనాథల బలగం 'ఆ నలుగురు'

2016లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీనారాయణ మృతదేహం (ఫైల్)



ఎవరూ లేని మృతదేహాలకు దహన సంస్కారాలు

- ఆదర్శంగా నిలుస్తున్న ఆత్మీయ సహకార సంఘం నిర్వాహకులు
- ఇప్పటికీ వేల సంఖ్యలో అంత్యక్రియలు



హిందూ ముక్తిస్థల్ శ్మశాన వాటిక

కాశీబుగ్గ సెంటర్ : నా అనే వారు ఎవరూ లేక కొంత మంది.. మతిస్థిమితం కోల్పోయి మరో కొంత మంది.., కుటుంబంతో తగవుతోనో ఎంతో మంది, ఎవరు ఎక్కడ పుట్టారో గానీ వరంగల్ నగరంలో ఫుట్‌పాత్ మీద, బస్టాండ్స్ ప్రాంగణంలో, రైల్వే స్టేషన్స్ ముందు, జంక్షన్లలో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్న వారు మన కళ్ల ఎదుట కనబడుతున్నారు. ఇలా వృద్ధాప్యంతో అనారోగ్యం బారిన పడి వారు సేద తీరుతున్న ప్రాంతంలోనే ప్రాణాలు వదులుతున్నారు. అలాంటి అనాథ శవాల సంఘటనలను చూసిన వరంగల్ నివాసి వంగర భాస్కర్ (మహదేవ) అంతర్మథనంతో తన మిత్రులు టి.వి. అశోక్ కుమార్, భవాని శంకర్, స్వర్గరథం శ్రీను, ప్రతాపని సుధాకర్ సమాలోచన చేసి అనాథ శవాలకు దహనసంస్కారాలు చేయాలని నిశ్చయించుకున్నారు. వెంటనే ఒక వేదికకు అంకురార్పణతో ఆత్మీయ సహకార సంఘం 12 ఏప్రిల్ 2010 స్థాపించి అనాథ శవాల దహన సంస్కారాలకు ఆత్మబంధువులుగా నిలుస్తున్నారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం సొంతంగా కొంత నగదును సమకూర్చుకొని కార్యక్రమాలను ఇప్పటికి వేల సంఖ్యలో కాశిబుగ్గ సమీపంలోని హిందూ ముక్తిస్థల్ స్మశాన వాటికలో నిర్వహిస్తున్నారు. త్రినగరిలో ఎక్కడైనా అనాథ శవం ఉన్నట్లు వంగర భాస్కర్ (మహదేవ)కు సమాచారం తెలిసిన వెంటనే తన బలగంతో స్వర్గరథంతో మృతదేహం ఉన్న స్థలానికి చేరుకొని శవాన్ని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు చేసి సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎవరైనా ఆర్థిక స్థోమత లేక అంత్యక్రియలు చేయలేని దీనస్థితిలో ఉంటే కూడా ఖర్చుల నిమిత్తం డబ్బులు అందజేసి మానవత్వం చాటుకుంటున్నారు. అనాథ శవాలను ముట్టుకోవడానికి ఎవరు ముందుకు రాని సమయంలో తామున్నామంటూ భరోసా నిస్తూ శవాల సమాచారం ఇస్తే ఈ కార్యాన్ని మేమే నిర్వహిస్తామని సహకార సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్, కోశాధికారి భాస్కర్ తెలిపారు. సమాచారం తెలుపడానికి 984923527 ,9866564364 నంబర్లకు ఫోన్ చేయాలని కోరుతున్నారు.

అనాథల బలగం మేము



ఏ కారణం చేతనో కుటుంబ సభ్యులకు దూరమై వరంగల్ నగరంలో అనాథ శవాలుగా ఉన్న మృతదేహాలకు మేం ఒక బలగంగా ఉండాలని ముందుకు వచ్చి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నాము. నలుగురితో ఏర్పడ్డ సంఘం ప్రస్తుతం 35 మంది సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నాము.

- టి.వి అశోక్ కుమార్, ఆత్మీయ సహకార సంఘం అధ్యక్షుడు

గౌరవంగా అంతిమ సంస్కారం



అనాథ శవాలు అనాథలుగా ఉండకూడదనే ఉద్దేశంతో గౌరవంగా అంతిమ సంస్కారం చేయాలని నా మిత్రులతో చర్చించి దహన సంస్కారాలు చేయడానికి శ్రీకారం చుట్టి సేవా కార్యక్రమాలను ప్రారంభించాము.

- వంగర భాస్కర్ (మహదేవ), సంఘం కోశాధికారి

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ





అక్షిత రాథోడ్   బొబ్బల అక్షయ్   సుదీంద్ర

హన్మకొండ: జేఈఈ మెయిన్స్‌లో హనుమకొండలోని శ్రీ చైతన్య స్కూల్ పూర్వ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. భూక్యా అక్షిత రాథోడ్ 23వ ర్యాంక్, బొబ్బల అక్షయ్ 143, తాటికొండ సుదీంద్ర 221, అంబాల హిమశ్రీ 324, మామునూరి సాయి శ్రీమంత్ 485, భూక్యా శ్రీవిద్యా 584, ఎల్లంబట్ల సాయి విశేష్ శర్మ 924, మాడిశెట్టి ఆదిత్యనాథ్ 1194, కోడూరు చిన్ని కృష్ణ 2130, మిటుకుల సాయివర్షిత్ 3032, కడవెండి హిమవర్ష 5318, ఆరూరు వైష్ణవి 6355, తెల్లం ప్రణవి 7476 ర్యాంకు సాధించి ఉమ్మడి వరంగల్ జిల్లాకు తలమానికంగా నిలిచారని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్, ప్రధానోపాధ్యాయులు రావు సురేఖ తెలిపారు. అనంతరం వారికి అభినందనలు తెలిపారు.

బీసీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

కాజీపేట అర్బన్ : మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటి జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని ఆ కళాశాలల రీజినల్ కోఆర్డినేటర్ జి.రాంరెడ్డి ఆదివారం తెలిపారు. పూలే గురుకుల కళాశాలలకు చెందిన 10 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించి జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లను సాధించాలని విద్యార్థులను అభినందించారు.

వీధికుక్కలతో జనం బెంబేలు



జూబ్లీమార్కెట్‌లో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కాజీపేట: వీధి కుక్కల సంచారం పట్టణంలో విపరీతంగా పెరిగింది. మునుపెన్నడూలేని రీతిలో కుక్కలు కాలనీల్లో సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బాటసారులు, వాహనదారుల వెంట పడి కుక్కలు కరుస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. బాపూజీనగర్, డీజిల్‌కాలనీ, రైల్వేక్వార్టర్స్, సోమిడి, వెంకటాద్రినగర్, జమామసీద్ గల్లీలో వీధి కుక్కల బెడద ప్రమాదకరంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. వారం రోజుల్లో పలువురు బాటసారులు వీటి బారిన పడిన ఘటనలు ఉన్నాయి. స్థానిక అర్బన్ హెల్త్‌సెంటర్లలో సరైన మందులు లభించక ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి నగరంలోని ఎంజీఎం ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధికుక్కలను పట్టించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ కార్యకర్తలకు సన్మానం

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్క మూల గణపతి దివ్య క్షేత్రంలో ఆదివారం రజతోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం పంచుకుని భక్తులకు సేవలు అందించిన కార్యకర్తలు, పండితులను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణ శర్మలు ఘనంగా సన్మానించారు. స్వామి వారి చిత్రపటాలను అందించి ఎల్లప్పుడు దైవకృప ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. గంగుల రాజిరెడ్డి, శనిగరపు రాజ్ మోహన్, రవి, మణిదీప్, సుధీర్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అండగా నిలవాలి



ఖిలావరంగల్ : మాట్లాడుతున్న రమేష్



హసన్‌పర్తి: కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు

ఖిలా వరంగల్ : సేవభావంతో ప్రతి ఒక్కరూ అనాథ వృద్ధులను అక్కున చేర్చుకుని అండగా నిలవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మునుగోటి రమేష్ సూచించారు. వాసవీమాత కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా ఆదివారం ఖిలావరంగల్ మండలం నక్కలపెల్లి శివారులోని ఎలుగందుల వృద్ధాశ్రమంలో అర్బన్ జిల్లా యువజన నేత సుద్దాల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై వాసవీమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ కన్న కుమారులు రోడ్డుపై వదిలేయటంతో అనాథులుగా మారారని వృద్ధులు, అనాథ బాలలకు మానవతా దృక్పథంతో సేవ చేస్తే దేవుడికి సేవ చేసినట్లే నని అన్నారు. అనంతరం వృద్ధుకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సమావేశంలో ఎలగందుల లక్ష్మీనారాయణ, మంచాల రఘునందన్, మునుగోటి రవి, ఐత మురళి తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

గవిచర్ల రోడ్డులోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో వాసవీ క్లబ్స్ కేసీజీఎఫ్ డాక్టర్స్ వరంగల్, వాసవీ క్లబ్స్ ఇంటర్‌నేషనల్ వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ నరేష్‌కుమార్, సోమ శ్రీధర్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, వల్లా పృద్వీరాజ్, రవీందర్, అశోక్, సుకేంద్రనాథ్, కృష్ణమూర్తి, ఆశ్రమ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, ఎలగందుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంకుమ పూజ వ్రతం

శ్రీవాసవీమాత జయంతి సందర్భంగా ఆదివారం వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శివనగర్‌లోని ఆర్య వైశ్య భవనంలో కన్యకా పరమేశ్వరీ కుంకుపూజను శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు , వెంకటేశ్వరచార్యులు ఆధ్వర్యంలో కుంకుమ పూజను నేత్రపర్వంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థమే కన్యకాపరమేశ్వరి పూజలు నిర్వహించామని ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరాంరాజేష్, రావికంటి అశోక్, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, పాల్గొన్నారు.

వాసవీమాత శోభాయాత్ర

శ్రీవాసవీమాత, కన్యకాపరమేశ్వరీ జయంతి సందర్భంగా ఆదివారం శివనగర్‌లోని వరంగల్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వాసవీమాత శోభాయాత్రను నిర్వహించారు. ముఖ్యతిథిగా ఆయన హాజరై ఆర్యవైశ్య మహిళలతో కలిసి వాసవీమాత చిత్రపటానికి ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మహిళలు రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, రాధిక, విమల ,శైలజ, త్రివేణి పాల్గొన్నారు.

హసన్‌పర్తి : వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవీక్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వాసవీమాతాకు నివాళులర్పించారు. మహిళలుపెద్ద ఎత్తున మంగళహారతులు పట్టారు. కార్యక్రమానికి వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిదిర కరంచంద్, జోన్‌చైర్మన్ అప్పనిశంకర్, కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి చిదర పురవర్ధన్, క్లబ్ ప్రతినిధులు రమేష్, శ్రీనాథ్, చకిలం సులోచన, పద్మ, లక్ష్మీ, భార్గవి, వనమాల, జయశ్రీ, విజయ పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

హన్మకొండ: హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని పార్కులో ఆదివారం 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత ఆధ్వర్యంలో హైదరాబాద్ శ్రీకర హాస్పిటల్స్ సహకారంతో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హాస్పిటల్ ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ కొమురెల్లి రాకేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం కనుకదుర్గ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, భవాని నగర్, విజయ్‌పాల్ కాలనీ, ఇంద్రానగర్, వికాస్ నగర్ ఎన్జీవోస్ కాలనీ వాసులు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. మోకాళ్ళ నొప్పులు, నివారణ మార్గాలపై కాలనీల వాసులకు డాక్టర్ రాకేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్‌రెడ్డి, కనుకదుర్గ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి నారాయణరావు, ఎక్సైజ్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భరత్ బాబు, రవీందర్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరి సోమిరెడ్డి, రాములు, తిరుపతి రెడ్డి, అశోక్, పాల్గొన్నారు.

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కేర్ హోమియోపతి ఆస్పత్రి ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేశ్, డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, శేఖర్, మ ధుసూదన్, రాజ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యోన్ముఖుల్ని చేసేందుకు 'మన్‌కీ బాత్'



కాశిబుగ్గ :మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



హన్మకొండ: మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు, కార్యకర్తలు



ఖిలావరంగల్ : వీక్షిస్తున్న బీజేపీ నేత రవికుమార్

కాశిబుగ్గ : దేశ ప్రజలను అన్ని కార్యక్రమాల్లో కార్యోన్ముఖుల్ని చేసేందుకే ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం చేపడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఆదివారం ఆయన ఓ సిటీలోని తన క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవ, సమాజంలో మార్పులు ప్రజలు ఎలా ముందుకు వెళ్తున్నారో ప్రధాని వివరించారన్నారు. మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను వందకోట్ల ప్రజలు వీక్షించారని దీనిని బట్టి చూస్తే దేశంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ అల్లం నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, మార్టిన్ లూథర్, సంగాని జగదీష్, రత్నం కిషోర్, ఉప్పల సరేందర్, మందా శ్రీనివాస్, క్రాంతి, శివ, రాజు, కిషన్, జనార్దన్ పాల్గొన్నారు.

హన్మకొండ: ప్రజల్లో స్ఫూర్తిని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమమే మన్‌కీ బాత్ అని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ప్రధాని మోదీ ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్ వద్ద పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్క్రీన్ ఏర్పాటు చేసి తిలకించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ దేశ ప్రజల్లో అనేక మంది మౌనంగా అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశం తలెత్తుకుని గర్వంగా జీవించేలా చేస్తున్నారని వీరిని ప్రధానమంత్రి మోదీ తన ప్రసంగాల ద్వారా ప్రపంచం దృష్టికి తీసుకువస్తున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డొంతి దేవేందర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, కందగట్ల సత్యనారాయణ, కడవెరు శ్రీనివాస్, నర్మెట్ట శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీలోని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని స్థానికులు వీక్షించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కారకర్తలతో పా టు స్థానికులు వీక్షించారు.

ఖిలా వరంగల్: ప్రధానమంత్రి మోదీ చేపట్టిన మన్‌కీ బాత్ ఓ అద్భుతమని, దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమని వరంగల్ తూర్పు నియోజకవర్గ బీజేపీ నేత గంట రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ శివనగర్‌లోని బూత్ 158లోని తన స్వగృహంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆయన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా 100 కోట్ల శ్రోతలకు చేరువై రికార్డు సృష్టించిందన్నారు. కార్యక్రమంలో బైరి శ్యాం,పాక దయానంద్, విజయ్, కిషోర్‌కుమార్, నిరంజన్,కార్యకర్తలు పాల్గొన్నారు.

మడికొండ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 100వ ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం మడికొండలోని 46వ డివిజన్ దళిత మోర్చా అధ్యక్షుడు గడ్డం కిరణ్ నివాసంలో బీజేపీ నాయకులు టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎల్కతుర్తి మండల ఇన్‌చార్జ్ పానుగోటి వెంకట్‌రావు, బైరపాక వెంకటేష్, బైరి సతీష్, బుర్ర నరేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి : ప్రధాని మోదీ 100వ ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమం గోపాలపురంలో ఆదివారం ప్రదర్శన జరిగింది. కార్యక్రమం కోసం ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. గోపాలపురంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొండ హరిబాబు ఆధ్వర్యంలో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

హజ్ యాత్రికులకు శిక్షణ



యాత్రికులకు సూచనలు చేస్తున్న డాక్టర్ అనీస్ సిద్దిఖీ

న్యూశాయంపేట : పవిత్ర మక్కా హజ్‌యాత్రకు ఎంపికై వెళ్లే ఉమ్మడి వరంగల్ జిల్లా వాస్తవ్యులకు శని, ఆదివారాల్లో వరంగల్ ఇస్లామియా కళాశాల ఆవరణలో అంజుమనే హుజాజ్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. యాత్ర ఏ విధంగా చేయాలి, అక్కడి పరిస్థితులు, తదితర అంశాలను యాత్రికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అనీస్ సిద్దిఖీ, డాక్టర్ అజీజ్‌ఉర్సీ, నజీమే జిలానీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం



జెండా ఊపుతున్న బీజేపీ నాయకుడు సతీష్

కరీమాబాద్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని బీజేపీ వరంగల్ తూర్పు సీనియర్ నాయకుడు కుసుమ సతీష్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆర్టీసీ కార్మికులు బీఎంఎస్‌లో చేరేందుకు హైదరాబాద్‌కు వెళ్లగా బస్సులను ఆయన పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ పాలనకు ఆకర్షితులై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరడం జరుగుతుందని చెప్పారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలనను బీజేపీ అంతమొందిస్తుందని పేర్కొన్నారు. కార్మిక, కర్షక వర్గాల ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని, అందుకు నిదర్శనమే ఆర్టీసీ కార్మికులు బీఎంఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జలగం రంజిత్, బండి సాంబయ్య యాదవ్, దేవేందర్, వీరస్వామి, పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని కేసీ క్యాంప్, రామారం, భీమారం, కోమటిపల్లి, భద్రకాళినగర్, ఎర్రగట్టుగుట్ట, కిట్స్, హసన్‌పర్తి, చింతగట్టు ఏరియాల్లో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు (1991-92) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఎర్రగట్టుగుట్ట క్రాస్‌లోని మిత్ర కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు రాంనర్సింహాచార్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు బొక్క కుమార్, ఎం.శ్రీనివాస్, గౌరిశెట్టి శ్రీనివాస్, ఎం.రవీందర్, ఎస్.దయాకర్, దామోదర్, ఎ.మమత, డి.రాజు, ఎస్.రాజు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

కాశిబుగ్గ : అన్నదానం మహాదానం అని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ అన్నారు. ఆదివారం అయన కాశిబుగ్గలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నియమనిష్టలతో మాల ధరించి పూజలు చేస్తున్న స్వాములకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యమన్నారు. అనంతరం సతీష్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాకం హరిశంకర్, కోట సతీష్, కట్టర్ సతీష్, ఎరుకుల రఘునారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వంగరి రవి తదితరులు పాల్గొన్నారు.